



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 22 అక్టోబరు 2025 | 5



కార్తీకం..శివోహం

నేటి నుంచి కార్తీకమాసం - జిల్లాల్లో ఎన్నో శైవక్షేత్రాలు

రాజమహేంద్రవరం సిటీ/బిక్కవోలు/దివాన్‌చెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాదులు అనంతమైన పుణ్య ఫలాలు ఇస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.అందుకే ఈ మాసమంతా ఆధ్యాత్మికతే కనిపిస్తుంది. మాలధారణలు, సంప్రదాయాలు ఉట్టిపడతాయి. ఏ శైవ క్షేత్రానికి వెళ్లినా శివపంచాక్షరీనామమే ప్రతిధ్వనిస్తుంది. శరదృతువులో వచ్చే కార్తీకమాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు కాబట్టి కార్తీకమాసమని పేరు వచ్చిందని చెబుతుంటారు. కార్తీకమాసం శివకేశవులు ఇద్దరికీ ప్రీతిదాయకం. కార్తీకమాసంలో ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.ఈ మాసంలో వనసమారాధనలు జరుగుతాయి.

ఆలయాలివిగో..

- ఈ మాసంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి తీరం చాలా ప్రత్యేకం. తెల్లవారుజామునే మహిళా భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరిస్తారు.నదిలో దీపాలు వదులుతారు. అక్కడే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. గోదావరికి అటువైపున ఉన్న కొవ్వూరులోను తెల్లవారుజామున స్నానాలు, ఆచరిస్తారు.బిక్కవోలు, కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరంలో కార్తీకమాసంలో దర్శించదగ్గ ఆలయాలున్నాయి. బిక్కవోలులో 1100 ఏళ్ల కిందటి గోలింగేశ్వరస్వామి ఆలయం, ఇళ్లపల్లిలోని 108 స్తంభాల గుడి, బలభద్రపురంలోని శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు చూడవచ్చు. ధవళేశ్వరంలో అగస్త్యేశ్వరుడు, రాజమహేంద్రవరంలో మార్కండేశ్వరుడు, ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.ఇటీవలే నిర్మించిన ఉజ్జయిని మహాకాలేశ్వరాలయం.
- కాకినాడ జిల్లాలోని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం కార్తీకానికి ముస్తాబైంది. సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, అన్నవరం సత్యదేవుడి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం, ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరస్వామి, కె.గంగవరం మండలం కోటిపల్లి, పంచారామల్లో ఒకటైన ద్రాక్షారామ, కొత్తపేట మండలం పలివెల కొప్పేశ్వరుడు,అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలోని వ్యాఘ్రేశ్వరస్వామితో పాటు ఏకా దశరుద్రులుగా పేరుగాంచిన 11 ఆలయాలు దర్శించుకుంటే పుణ్యఫలమని ప్రతీతి.

నేటి నుంచి ఆరంభం

ఈ ఏడాది కార్తీకం బుధవారం ప్రారంభమై వచ్చే నెల 20న ముగుస్తుంది. ఈ మాసంలో ప్రతిరోజూ ఓ పండుగే. నాలుగు సోమవారాలతోపాటు కార్తీకపౌర్ణమి ఎంతో విశిష్టమైనవి. అట్లతద్ది వాయినాలు తీర్చుకోలేని వారు సోమవారం పౌర్ణమి నాడు తీర్చుకుంటారు. ఈనెల 23న యమ విదియ. ఆ రోజున సోదరి ఇంట సోదరులు భోజనం చేసి కానుకలు ఇచ్చి రావాలి. 25న నాగులచవితి. పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుని ఆరాధిస్తారు. 30న గోపాష్టమి, నవంబరు 2న చిలుక ద్వాదశిని పురస్కరించుకుని క్షీరాబ్ధి పూజ చేస్తారు. 4న వైకుంఠ చతుర్దశి, 5న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం. 18న మాసశివరాత్రి, 21న పోలిస్వర్గం, పాడ్యమి దీపాలు విడిచిపెడతారు.



ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులకు పురస్కారం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

జీఎస్టీ వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ఇటీవల నిర్వహించిన సూపర్ జీఎస్టీ 2.0 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు సీఎం చంద్రబాబు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. జీఎస్టీ విధానం, పన్ను తగ్గింపుతో కలిగే ప్రయోజనాలపై చర్చించే అవకాశం పొందారు. థర్డ్ బీకాం (అకౌంటింగ్) చదువుతున్న టి.రేఖ కుమారి హిందీ వక్తృత్వం, థర్డ్ బీఏ (ఎకనామిక్స్) చదువుతున్న పి.సాయి అపర్ణ ఇంగ్లీష్ వక్తృత్వ పోటీల్లో మంచి ప్రతిభ చూపించి ప్రథమస్థానంలో నిలిచారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ రామచంద్ర, వాణిజ్యవిభాగాధిపతి సత్యనారాయణ, వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు ప్రతిమ, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి బాలయ్య అభినందించారు.



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

దీపావళి అంటే సందడే సందడి. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు.ఈ దీపావళి పండగకు ఉమ్మడి జిల్లాలో బాణ సంచా మోతమోగింది. జువ్వలు, బాంబులు, చిచ్చుబుడ్లు, లక్ష్మీ టపాసులు పేలాయి. రంగురంగుల మందుగుండు నిప్పులు చిమ్ముతూ పొగలుకక్కాయి. పండగ సంతోషంతో జనం ఎక్కడికక్కడ మందుగుండు భారీగా పేల్చారు. ఒక్కసారిగా పేలిన టపాసులతో గాల్లో కాలుష్యం తీవ్రత పెరిగింది. పొగ నిండిపోయి గాలి నాణ్యత దెబ్బతింది. ముఖ్యంగా సోమవా రం రాత్రి 7 గం టల నుంచి అర్ధరాత్రి 12 గం టల వరకు గాలి నాణ్యతను సూచించే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా రెడ్‌సిగ్నల్‌లోకి చేరింది. బాణ సంచావల్ల అత్యధిక కాలుష్యం అమలా పురంలో నమో దైంది.

అమలాపురాన హై...

ఉమ్మడి జిల్లా మొత్తం మీద అమలాపురం పట్టణంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. వాయుకాలుష్యం అత్యధికంగా ఇక్కడే నమోదైంది. పండగరోజు సోమవారం సాయం త్రం ఆరు గంటలకు ఏక్యూఐ 65 నుంచి ఏకంగా 138కి చేరింది. రాత్రి 7 గంటలకు 229, 8 గంటలకు 243, 9 గంటలకు 222, 10 గంటలకు 212, 11గంటలకు 198, అర్ధరాత్రి 12గంటలకు 164 నమోదైంది. తిరిగి మంగళ వారం 11గంటల తర్వాత వాయు కాలుష్య తీవ్రత తగ్గిపోయి తిరిగి 56కి చేరింది.

రాజమండ్రిలో ఇలా..

రాజమహేంద్రవరంలోను వాయు కాలుష్యం భారీగా వెదజల్లింది. సోమవారం సాయం త్రం 5 గంటలకు ఏక్యూఐ 82గా నమోదైంది. 6 గంటలకు 121, 7గంటలకు 196, 8 గంటలకు 212, 9గంటలకు 199, 10 గంటలకు 197, 11గంటలకు 198, 12గంటలకు 164 చొప్పున నమోదైంది.మంగళవారం ఉదయం 10గంటల తర్వాత 62కి చేరింది.

కాకినాడలో కాస్త బెటర్

కాకినాడ నగరంలో సోమవారం సాయం త్రం 6 గంటలకు ఏక్యూఐ 156 ఉండగా, 7గంటలకు 174, 8గంటలకు 173, 9 గంటలకు 164, 10 గంటలకు 167, 11 గంటలకు 166, 12గంట లకు 151 నమోదైంది. అర్ధరాత్రి ఒంటిగంటకు 138, 2గంటలకు 103 నమోదవగా ఉదయం 8 గంటలకు తిరిగి 66కి చేరి గాలి నాణ్యత మెరుగైంది.

పొగ 'మోతెక్కింది'

- హోరెత్తిన బాణసంచా పేలుడు
- ప్రమాదకర స్థాయికి చేరిక
- అమలాపురాన ఏక్యూఐ 243
- రాజమహేంద్రవరంలో 212
- కాకినాడ నగరంలో 174
- 100 దాటితే శ్వాస ఆడదు

స్వచ్ఛమైన గాలి లేదు!

గాలిలో నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఆధారంగా కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు రూ పొందించింది. ఏ క్యూఐ సంఖ్య 50 పాయింట్లలోపు ఉంటే అక్కడ గాలి నాణ్యత బాగుందని అర్థం. 50 నుంచి 100 వరకు ఉంటే మోడరేట్, 100 నుంచి 150 వరకు ఉంటే పూర్, 150 నుంచి 200మధ్య ఉంటే అన్‌హెల్తీ వాతావరణం కింద భావించాలి. పండగ రోజు రాత్రి కాకినాడ,అమలాపురం, రాజమహేంద్రవరంలో వాయు కాలుష్య తీవ్రత పెరిగిపోయింది. ఏక్యూఐ 100 దాటితే ఆస్తమా, కిడ్నీ, గుండె జబ్బులతో బాధపడుతున్న వారు శ్వాస తీసు కోవడం ఇబ్బందిగా మారుతుంది. ఏక్యూఐ 200 దాటితే శ్వాస సమస్యలు ఎదుర్కొంటారు.ఎందుకంటే మందుగుండు పేలుడుతో వెదజల్లే వాయు కాలుష్యంలో కార్బన్ డయాక్సైడ్, నైట్రోజెన్ డయా క్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ మోతాదు అధికం. దీనివల్ల శ్వాస సమస్యలు వస్తాయి.దీపావళి రోజు రాత్రి ఏకంగా అమలాపురం, రాజ మహేంద్రవరంలో ఏ క్యూఐ 200 పాయింట్లు దాటేసింది.

రాయవరం అగ్ని ప్రమాద మృతులకు సాయం

7

456 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 456 మంది ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది.ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో మంగళవారం ఆర్టీసీ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. త్వరలోనే పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేస్తామని పదోన్నతుల కమిటీ చైర్మన్ రాఘవకుమార్ తెలిపారు.

రేపు బాధ్యతలు స్వీకరించనున్న తెలుగు వర్సిటీ వీసీ

రాజమహేంద్రవరం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం లోని పొట్టిశ్రీరాములు తెలుగు వర్శిటీ తొలి వైస్ చాన్సలర్‌గా నియమితులైన డి.మునిరత్నం నాయుడు గురువారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ మేరకు బొమ్మూరు తెలుగు వర్శిటీ ఆవరణ శుభ్రం చేయించే పనులు ఆరంభమయ్యాయి.వర్శిటీ భవనాలన్నీ శిథిలావస్థకు చేరిన సంగతి తెలిసిందే.



మీ త్యాగం స్ఫూర్తిదాయకం : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ కీర్తి, ఎస్పీ నరసింహ కిశోర్, పోలీసులు తదితరులు.. హాజరైన పోలీస్ అమరుల కుటుంబీకులు

పోలీసుల సేవలు అమూల్యం

పోలీస్ అమర వీరుల దినంలో మంత్రి దుర్గేశ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు కీలకమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల దినం మంగళవారం ఎస్పీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ అమరవీరుల స్మారకస్తూపం వద్ద పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన 191 మంది అమరుల వీరోచిత సేవలను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. కుటుంబం కంటే ప్రజారక్షణకే అధిక ప్రాధాన్యం ఇచ్చే పోలీస్ సేవలు అమూల్యమన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న లద్దాక్ ప్రాంతంలో చైనా సైన్యం చొచ్చుకొస్తుంటే అతి కొద్ది మంది మాత్రమే ఉన్న మన జవానులు వీరోచితంగా పోరాడి వాళ్లను వెనక్కు తరిమి వీరమరణం పొందారన్నారు.వారి సేవా స్ఫూర్తి, ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల దినం నిర్వహించుకుంటున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల దినం ప్రతి పోలీస్‌కు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జేసీ మేఘ స్వరూప్, అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం.మురళీ కృష్ణ, ఏవీ.సుబ్బరాజు,చెంచిరెడ్డి, డీఎస్పీలు రామకృష్ణ, దేవ కుమార్, శ్రీకాంత్, విద్య, భవ్యకిషోర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు లేన్లగా హైవే విస్తరణ

అధికారులతో సమీక్షించిన ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువు నుంచి అనకాపల్లి వరకూ 16వ నంబరు జాతీయ రహదారిని ఆరులేన్లగా విస్తరించనున్నారని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె ఎన్‌హెచ్ 16 విస్తరణ పనులపై సమీక్షించారు.జాతీయ రహదారుల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. దివాన్‌చెరువు- అనకాపల్లి ఆరు లేన్ల విస్తరణ ప్రాజెక్టు తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. 2027 పుష్కరాలను దృష్టి ఉంచుకుని రహదారి పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 11 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు జరగనున్నాయన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.కృష్ణమూర్తి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.160.245 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరిస్తామన్నారు. రాజానగరం మండలంలో ఈస్ట్ గోనగూడెం, కల్వచర్ల, రాజానగరం,జగన్నాథపురం, వెంకటాపురం, నరేంద్రపురం, వెలుగుబంద జంక్షన్ మీదుగా దివాన్ చెరువు వరకూ ప్రాజెక్టు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ విశాఖ - రాజమహేంద్రవరం ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గ్రామన్ బ్రిడ్జి నుంచి రాజమండ్రి, రాజానగరం వెళ్లే రహదారి మార్గంలో రూట్ డైవర్షన్‌కు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జేసీ వై.మేఘ స్వరూప్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఆర్వో టి.సీతారామమూర్తి, టెక్నికల్ మేనేజర్ వి.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో పడకేసిన వైద్యం

- 37 పీహెచ్‌సీల్లో వైద్యుల సమ్మె
- 17 మంది సమ్మెకు దూరం
- వైద్యం అందక ప్రజలు విలవిల



(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

మెడికల్ ఆఫీసర్ల సమ్మెతో జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యం పడకేసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు చెబుతున్నప్పటికీ మంగళవారం వైద్యులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో స్టాఫ్ నర్సులే వైద్యులుగా వ్యవహ రించడం గమనార్హం. సెప్టెంబరు చివరి వారం నుంచి మెడికల్ ఆఫీసర్లు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో మాదిరిగా పీజీ సీట్లలో వెయిటేజీ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా 37 పీహెచ్‌సీల వద్ద డాక్టర్లు సమ్మె ఆరంభించారు. జిల్లాలో 37 పీహెచ్‌సీల్లో 20 మంది డాక్టర్లు సమ్మె చేస్తుండగా 17 మంది సమ్మెకు దూరంగా ఉన్నారని జిల్లా అధికారులు చెబు తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా రాజమహేంద్రవరం మెడికల్‌కాలేజికి చెందిన సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు పలు బాధ్యతలు అప్పగించారు.స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బం దితో కలుపుకుని సుమారు 200 మందికి మూడు షిఫ్టులుగా డ్యూటీలు కేటాయించినట్టు తెలిపారు.వీరికి ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ ఒకషిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటలకు వరకూ మరో షిఫ్ట్, రాత్రి 8 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకూ మరో షిఫ్ట్ కేటాయించారు.రెస్పాన్సిబుల్ సూపర్‌వైజర్స్‌గా కొంతమంది, ఐదుగురు ప్రోగ్రామ్ ఆఫీసర్లను నియమించారు.దీపావళి ముందు రోజు కొందరు పీహెచ్‌సీలను పట్టించుకోలేదు.దీపావళి రోజు సుమారుగా మూసేసినట్టే. ఇక మంగళవారం వైద్యులెవరు హాజరు కాలేదు. దీంతో స్టాఫ్ నర్సులే సర్వం చూస్తుండడం గమనార్హం.జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యం పడకేసింది. సబ్ సెంటర్లదీ ఇదే పరి స్థితి. వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

30 వరకు ఈ-క్రాప్ నమోదు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రబీ సీజన్‌కు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో 3,214 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. రాబోయే రబీ సీజన్‌లో వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 55 వేల మెట్రిక్ టన్నులు అవసరమన్నారు. జిల్లాలో వరి ఈ పంట నమోదు 100 శాతం పూర్తయిందన్నారు. ఇతర పంటలను కలుపుకుని మొత్తం 62 శాతం నమోదైందన్నారు. అక్టోబరు 30 నాటికి 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు 212 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఎంపీడీవోలు, కమిషనర్లు సంక్షేమ హాస్టళ్లను సందర్శించాలన్నారు.

కార్తీకం.. సత్యదేవుడి సన్నిధి సిద్ధం!

- భక్తులకు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెలలో సుమారు 20 లక్షల మంది విచ్చేస్తారని అంచనా
- 1.50 లక్షల వ్రతాలు జరిగే అవకాశం



దాత నిర్మించిన భారీ విశ్రాంత షెడ్డు

పశ్చిమ రాజగోపురం వద్ద వ్రత భక్తుల కోసం ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింటు

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ఎంతో ప్రీతికరమైనది కార్తీకమాసం. ఈ కార్తీకంలో హరిహరక్షేత్రంగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధికి ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి సుమారు 20 లక్షలమంది తరలివస్తారని అంచనాతో దానికణుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే వివిధ శాఖలు సమన్వయంతో పలు లక్ష్యాలను నిర్దేశించుకోగా వాటిని ఆచరణలోకి తీసుకొచ్చారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. పశ్చిమ రాజగోపురం వద్ద ఎటువంటి తోపులాటలకు ఆస్కారం లేకుండా వాటర్‌ప్రూఫ్ షెడ్డు వేసి హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. లోపల వ్రత మండపాలు ఖాళీ అయితేనే హోల్డింగ్ పాయింట్ నుంచి భక్తులు లోపలకి చేరతారు. వాహనాలు అన్నింటికీ వన్‌వే మార్గం ఏర్పాటుచేశారు. పశ్చిమ రాజగోపురం ఎదురుగా సుమారు రూ.2.50 కోట్లతో ఫార్మాటికల్ సంస్థ సహకారంతో భారీ షెడ్డును వినియోగంలోకి తీసుకొచ్చారు. దీనిలో వ్రతం, దర్శనం, ప్రసాదం టిక్కెట్లు విక్రయాలు జరుపుతారు. అదేవిధంగా భక్తులు వేచిఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ పోలీస్ బందోబస్తు, వాకీటాకీల ద్వారా పర్యవేక్షణ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్‌రూం ద్వారా అధికారులు, సిబ్బందికి సూచనలు చేసేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. వివిధ వాహనాల్లో విచ్చేసే భక్తులకు పార్కింగ్ సత్యగిరికి తరలించి అక్కడినుంచి దేవస్థానం ఉచిత వాహనాల్లో స్వామి సన్నిధికి చేర్చుతారు. నవంబరు 2న స్వామివారి తెప్పోత్సవం సాయంత్రం 5.30కి ప్రత్యేకపూజలతో ప్రారంభమై రాత్రి 7.30కి పంపా సరోవరంలో నౌకావిహారం జరుపుతారు. ప్రధానంగా కార్తీకపౌర్ణమి రోజున జరిగే గిరిప్రదక్షిణకు సుమారు 2 లక్షల మంది విచ్చేయనుండగా.. ఉదయం 8 గంటలకు తొలి పావంచా వద్ద నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో మధ్యాహ్నం 2గంటల నుంచి సత్యరథంపై గిరియాత్ర నిర్వహిస్తారు. భక్తులు సత్యరథం ద్వారా గిరియాత్ర చేపట్టాలని అధికారులు కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించడం తప్పనిసరి



ఆటో, బస్సు, ఇతర వాహనాల డ్రైవర్లతో సమావేశంలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఈవో, ఎస్ఐ

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని వేలాదిగా రోడ్డు, రైలు మార్గాల్లో అన్నవరం విచ్చేసిన భక్తులను కొండపైకి తీసుకెళ్లే ఆటో, బస్సు, ఇతర ప్రయివేట్ వాహనదారులతో సోమవారం అన్నవరం ఎస్ఐ హరిబాబు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ప్రధానంగా లైసెన్స్ ఇతర డాక్యుమెంట్లను కలిగి ఉండాలని, యూనిఫాం ధరించి, అతివేగంగా వాహనాలు నడపకుండా ఉండాలన్నారు. నిర్ణయించిన పాసింజర్ల కంటే ఎక్కువమందిని ఆటోలో ఎక్కించకుండా వారిపై గౌరవంగా మాట్లాడడం, ఎవరైనా తమ లగేజీని ఆటోలో మరిచిపోయిన ఎడల వారికి బాధ్యతగా అప్పగించడం, సంబంధిత విషయాన్ని పోలీసులకు తెలియపరచడం చేయాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడకుండా, నిర్దేశిత ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలన్నారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు నిషిద్ధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ప్రత్యేకాధికారుల నియామకం

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తుల రద్దీ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్య చర్యల్లో భాగంగా దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ముగ్గురు దేవదాయశాఖ అధికారులను డిప్యూటేషన్‌లో ప్రత్యేకంగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, వాడపల్లి దేవస్థానం ఈవో ఎన్.చక్రధరరావు, లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజును నియమించారు. కార్తీకమాసంలో 4 శని,ఆది,సోమవారాలు... 2 దశమి, ఏకాదశిలు, కార్తీకపౌర్ణమి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం వంటి ముఖ్యమైన రోజు ల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. నిర్దేశించిన రోజుల్లో వీరంతా అన్నవరంలో ఉండి భక్తుల కోసం క్యూలైన్లు, వ్రతాల నిర్వహణ, మౌలిక వసతులు పర్యవేక్షణ చేయనున్నారు.

సత్యదేవుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిదిలో మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

బాణసంచా పేలుడులో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం

అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, జోగేశ్వరరావు వెల్లడి



అనపర్తిలో వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి/మండపేట/రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వి.సావరం, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం సరిహద్దుల్లోని లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్‌లో ఈ నెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు మంగళవారం ప్రకటించారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తాను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనడంతో పాటు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. అయితే కర్నూలులో ప్రధాని పర్యటన నేపథ్యంలో కమిటీ విచారణ కొంత ఆలస్యం అయినప్పటికీ మంగళవారం నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారన్నారు. ఈ ప్రమాదంలో యజమాని సహా పదిమంది మృతిచెందారని, బాధిత కుటుంబాలకు సరైన పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రిని ఒప్పించడంలో మంత్రులు సుభాష్, అనిత, ఎమ్మెల్యే జోగేశ్వరరావు తనతో పాటు కృషి చేశారని పేర్కొన్నారు. కార్మిక శాఖ నుంచి ఈ పరిహారం త్వరలోనే బాధిత కుటుంబాలకు అందజేస్తామని, అలాగే యజమాని తరపున కూడా పరిహారం అందేవిధంగా కృషి చేస్తామన్నారు. పది మంది మృతుల్లో అనపర్తి నియోజకవర్గానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండపేటలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ రెండురోజుల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులమీదుగా బాధితులకు ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

పిఠాపురంలో మృతురాలి తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద శిశువుతో బంధువులు

పిఠాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతి చెందిందని, శిశువును చిదిమేశారని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. వారు మంగళవారం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం పాడా పీడీకి ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ (25) ఈనెల 13న డెలివరీ కోసం ప్రభుత్వాసుపత్రిలో చేరింది. 14న డెలివరీ కాగా తల్లి, బిడ్డల పరిస్థితి సీరియస్‌గా మారడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీదుర్గ మరణించింది. శిశువును డెలివరీ సమయంలో చిదిమివేయడంతో ఒక వైపు చేయి పనిచేయకపోవడంతో పాటు కంటి పై గాయమైంది. హైరిస్క్ పేషేంటుగా ఉన్న శ్రీదుర్గకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా బలవంతంగా నార్మల్ డెలివరీ చేయడం వల్లే మరణించిందని మృతురాలి తల్లిదండ్రులు దొండపాటి రాజు, సుబ్బారావు ఆరోపించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు, వారి బంధువులు ప్రభుత్వాసుత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. హైరిస్క్ కేసు అని గుర్తించినా ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదని నిలదీశారు. వారికి గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు సంఘీభావం తెలిపారు. వారి ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, పోలీసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, జడ్పీటీసీ లోవరాజు పిఠాపురం పాడా కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణికి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పీడీ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

తంద్రవుతాడనుకుంటే తనువు చాలించే..

మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి

అతడి భార్య 9 నెలల గర్భిణి



లోవరాజు (ఫైల్)



బోరున విలపిస్తున్న లోవరాజు భార్య, తల్లి, అక్క, బంధువులు

కపిలేశ్వరపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం శివారు కొండాలమ్మ ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. అతడి భార్య 9 నెలల గర్భిణి కావడంతో ఆ కుటుంబం బోరున విలపిస్తుంది. మంగళవారం అంగర పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురానికి చెందిన కముజు లోవరాజు(33) మోటారు సైకిల్‌పై అంగర వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ బలంగా ఢీకొంది. లోవరాజు తలకు తీవ్రగాయం కావడంతో మృతిచెందాడు. మరో బైక్‌పై ఉన్న కాట్రేనికోన మండలం దొంతుకుర్రుకి చెందిన కాలేటి బాలయోగి, గెడ్డం నాగార్జునకు గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. లోవరాజు 104 వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి సోదరుడు కముజు వీరవెంకటసత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ పేర్కొన్నారు. లోవరాజు భార్య దుర్గ నీలిమ 9నెలల గర్భిణి, ఆసుపత్రిలో చేయాల్సి ఉండగా ఇంతలోనే ఇలా జరగడం పట్ల కుటుంబీకులు, బంధువులు జీర్ణించుకోలేక బోరున విలపిస్తున్నారు. లోవరాజు చిన్నవయసులోనే మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

రైల్వే పట్టాలపైకి వరదనీరు... రైల్వే అధికారుల సమీక్ష

పుంత రహదారులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల కారణంగానే ముంపు అని గుర్తింపు



సామర్లకోట ఎఫ్‌సీఐ గోదాముల వద్ద పుంత రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైలు పట్టాలపైకి ఆదివారం పెద్దఎత్తున వరదనీరు చేరిక, పలు రైళ్ల రాకపోకలకు సుమారు 16 గంటల పాటు అంతరాయం వంటి సంఘటనలను రైల్వే ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ విషయంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై రైల్వే ఉన్నతాధికారులు సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధ్యయనం చేయాలని ఆదేశించడంతో రైల్వే ఏఈఎన్ ప్రభాకర్, అధికారులు, సిబ్బంది మంగళవారం సత్యనారాయణపురం శివారు వీర్రాజునగర్, ఎఫ్‌సీఐ గోదాములు, మట్టలవారి చెరువు, ఏడీబీ రోడ్డు వంటి ప్రాంతాలను పరిశీలించి పట్టణ ఎగువ ప్రాంతాల్లో గరువులలో కురిసిన వర్షం నీరు రాకకు పూర్వం నుంచీ ఉన్న పుంతమార్గాలు, చెరువులకు ఉన్న స్లూయిజ్‌ల మార్గాలను, రైల్వే కాలువల నుంచి మున్సిపల్ డ్రైన్‌లోకి సత్యనారాయణపురం ఫ్లయ్‌ఓవర్‌బ్రిడ్జి పక్కనుంచి ఉన్న ప్రధాన డ్రైనులను పరిశీలించారు. పుంత రహదారులు పూర్తిగా ఆక్రమణలకు గురైనట్టు గుర్తించారు. అలాగే ఏడీబీ రోడ్డు మీదుగా రాక్ సిరామిక్ సమీపం నుంచి ఎఫ్‌సీఐ గోదాములు పక్క నుంచి రైల్వే తూముల మీదుగా పూర్వం నుంచి ఉన్న పుంత రహదారిని పూర్తిగా ఆక్రమించడం వల్ల ఎగువ ప్రాంతాల్లో వరదనీరు ఆ తూములమీదుగా కాకుండా రైలు పట్టాలపైకి చేరుతున్నందునే ముంపు సమస్య ఎదుర్కొంటున్నట్టు ప్రాథమికంగా గుర్తించి నివేదికలు రూపొందించారు. సత్యనారాయణపురం శివారున రైల్వే గోతులు ఆక్రమణలకు గురై పెద్దపెద్ద భవనాలు నిర్మించినట్టు క్షేత్రస్థాయిలో గుర్తించారు. ఆక్రమణలను గుర్తించేందుకు శాశ్వత ప్రాతిపదికన, భవిష్యత్తులో రైలు పట్టాల పైకి వరదనీరు చేరకుండా ఉండేందుకు రక్షణ చర్యలు చేపట్టేందుకు రైల్వే, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని స్థానిక అధికారుల బృందం నిర్ణయించి రైల్వే ఉన్నతాధికారుల అనుమతుల కోసం నివేదికలు పంపారు.

యువకుడిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ శివగణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లాకు చెందిన ఓ బాలిక (16) రాజమహేంద్రవరంలోని ఓ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతోంది. దీపావళి రోజున జొన్నాడకు చెందిన అజయ్ అనే యువకుడు తనకు మాయ మాటలు చెప్పి బలవంతంగా ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత క్రీడా పురస్కారాలైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతోపాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలు-2026కు సంబంధించి అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు దరఖాస్తులు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28లోపు కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సామర్లకోటలో బాలుడిపై కానిస్టేబుల్ దాడి

దళిత సంఘాల ఆందోళన



సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట బ్రౌన్‌పేటలో దీపావళి వేడుకల్లో తారాజువ్వలను నేలబారున విడుస్తున్నారన్న ఫిర్యాదులతో సోమవారం రాత్రి 10 గంటలకు దడాల అక్షయ్‌కుమార్ అనే దళిత బాలుడిపై పోలీసు కానిస్టేబుల్ సతీష్ దాడి చేయడంతో అపస్మారకస్థితికి చేరి ఆసుపత్రి పాలయ్యాడని దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. పోలీసులు వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. అక్షయ్ కుమార్‌కు ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి బానే ఉన్నట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించడంతో దళితసంఘాలు ఆందోళనలు విరమించారు. సతీష్‌పై కేసు నమోదు చేయాలని, బాధితుడికి ఆర్థిక సాయం అందించాలనే డిమాండ్లపై పోలీసులు చర్చలు జరిపారు. సతీష్ లాఠీతో కొట్టడం వల్ల అక్షయ్ ఫిట్స్ వచ్చి పడిపోయాడని అందోళనకారులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సామర్లకోట పోలీసులు పోలీసులు తెలిపారు.

దాడి చేయలేదు : డీఎస్పీ

సామర్లకోటలో బాలుడిపై పోలీసులు ఎవ్వరూ దాడి చేసి గాయపర్చలేదని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడించారు. దళిత యువకుడు అక్షయ్‌కుమార్‌నే కాదు మర్వెరినీ పోలీసులు కొట్టలేదని డీఎస్పీ శ్రీహరిరాజు ఖండించారు. మంగళవారం రాత్రి ఈ మేరకు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ శ్రీహరిరాజుతో బాటు సీఐ కృష్ణభగవాన్ కూడా పాల్గొన్నారు.

చిన్నింపేటలో పొల్యూషన్ బోర్డు కమిటీ తనిఖీలు



చిన్నింపేట సీపీఎఫ్ పరిశ్రమ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఏలేశ్వరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం చిన్నింపేట గ్రామంలో ఉన్న సీపీఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో మంగళవారం జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీలు చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలు చుట్టుపక్కల ఉన్న పొలాలకు కలుషిత నీరు చేరడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని గ్రామానికి పిల్లి చంద్రరావు ఫిర్యాదు చేశాడు. జాయింట్ కమిటీ సభ్యులు తనిఖీలకు హాజరై పరిశ్రమ నుంచి పొలాల్లో విడుదలయ్యే వ్యర్థాలు, నీటిని పరిశ్రమ పరిధిలో పరిశీలించారు. ఈ వివరాలు చెప్పేందుకు కమిటీ సభ్యులు నిరాకరించారు.

కాకినాడలో మహిళ అనుమానాస్పద మృతి



లక్ష్మి మృతదేహం

కాకినాడ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో మంగళవారం ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రానికి చెందిన కేఎస్ వెంకటేష్ స్థానిక ఎస్‌ఆర్‌కే బిల్డింగ్‌లో బేకరీ నిర్వహిస్తున్నాడు. ఇదే భవనం పై అంతస్తులో బేకరీకి సంబంధించిన కార్ఖానా ఉంది. ఇందులో స్థానిక బాలాజీచెరువు సెంటర్‌కు చెందిన ర్యాలీ లక్ష్మి (40) 2 నెలలుగా పనిచేస్తోంది. అయితే మంగళవారం సాయంత్రం యజమాని బేకరీలో బేరం చూస్తుండగా పై అంతస్తులోని ఖార్ఖానాలో ఉన్న లక్ష్మి అచేతనంగా పడిఉంది. ఈ విషయాన్ని ఆ పక్కనే ఉన్న దుకాణం యాజమాని గుర్తించి బేకరీ యాజమానికి సమాచారం ఇవ్వగా వెంకటేష్ వచ్చి లక్ష్మి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం పోలీసులకు తెలిపాడు. ఆటోలో లక్ష్మిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధా రించారు. లక్ష్మి భర్త నుంచి వేరుపడి ఉందని, ఆమెకు పదేళ్ల కుమార్తె ఉందని బంధువులు తెలిపారు. ఈ మేరకు కాకినా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకు ఉరేసుకున్న వ్యక్తి



పంకజ్ (ఫైల్‌ఫొటో)

తుని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు వ్యక్తి ఉరేసుకుని మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని ఎస్ఐ విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన పంకజ్ 20 రోజులుగా మతిస్థిమితం లేకుండా తుని రైల్వే స్టేషన్ పరిధిలో తిరుగుతున్నాడు. తుని రైల్వే స్టేషన్ శివారు తాళ్ళూరు రైల్వేగేటు సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ముమ్మిడివరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం కాశివాని తూము బైపాస్ సెంటర్‌లో మోటారుసైకిల్‌పై రోడ్డును దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో మోటారుసైకిల్‌పై ఉన్న తండ్రీ కొడుకులు గాయపడ్డారు. 2016 జాతీయ రహదారి కాశివానితూము బైపాస్ సెంటర్‌లో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మోటారు సైకిల్‌పై వెళుతున్న ముమ్మిడివరం మండలం గురజాపులంకకు చెందిన యడ్ల సుభాష్‌బాబు, యడ్ల అర్జున్‌కుమార్ గాయపడ్డారు. ఈ ఘటనలో తండ్రి తీవ్రంగా గాయపడగా కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిని వారిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

కన్నాయిగూడెం వాసుల ఆందోళన

కదిలిన అధికారులు, ఎమ్మెల్యే తెల్లం



ఇసుక లారీలు నిలిపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఎటపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇసుక లారీలు నియంత్రించాలని, డ్రైవర్లు నిర్లక్ష్యంగా ప్రమాదకర రీతిలో లారీలు నడుపుతున్నారని..వాటి రాకపోకలతో రహదారులు ధ్వంసవుతున్నాయని కన్నాయిగూడెం వాసులు ఆందోళనబాట పట్టారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దులోని కన్నాయిగూడెం వద్ద గ్రామస్తులు భద్రాచలం- చర్ల అంతరాష్ట్ర రహదారిపై 2 రోజుల పాటు ఇసుక లారీలను అడ్డుకున్నారు. దీంతో సరిహద్దులోని 2రాష్ట్రాల పరిధిలోని పోలీసులు, రెవెన్యూతోపాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కదిలారు. ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుంచి చర్ల వరకు చేపట్టే రహదారి మరమ్మతుల పనుల్లో భాగంగా మధ్యలో తమ పరిధి (ఆంధ్ర)లో ఉన్న ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు కూడా రహదారి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు ఇసుక రావాణా చేయవద్దని తెలంగాణలోని చర్ల, భద్రాచలం మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. మరోవైపు చింతూరు పీవో శుభం నోక్వాల్ సైతం స్పందించారు. కన్నాయిగూడెం వాసులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్ర పరిధి వరకు రహదారి మరమ్మతులు చేస్తామని హామీఇచ్చారు. ఆందోళనలతో సుమారు 10 కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోయాయి. తెలంగాణలోని దుమ్ముగూడెం మండలానికి చెందిన కొందరు ఇసుక లోడ్ లారీలను కన్నాయిగూడెంలో గ్రామస్తులు నిలుపుదల చేసిన విషయంపై అభ్యంతరం చెప్పడంతో ఎస్ఐ అప్పల రాజు, సీఐ కన్నపరాజు జోక్యం చేసుకున్నారు. పోలీసులు ఇసుక లారీలను పంపించివేయడంతో వివాదం సద్దుమనిగింది.



ఆ హా.. కాశం..

నీలి నీలి ఆకాశం... దట్టంగా అలముకున్న తెల్లటి మేఘాలు... ఇవి ఆకాశంలో తెల్లటి కొండలు మాదిరిగా కనిపించాయి. కాకినాడ జిల్లా పిఠాపురం 216వ జాతీయ రహదారిపై కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- పిఠాపురం (ఆంధ్రజ్యోతి)

గోకులం షెడ్ల లక్ష్యాలపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక రంగం అభివృద్ధి రైతు ఆదాయన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో బలంగా విస్తరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల అమలుపై మండలాల వారీగా సాధించిన పురోగతిని సమీక్షించారు. లక్ష్యాలను సమయానుసారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోకులం షెడ్ల లక్ష్యాలను సాధించేందుకు రైతుల నుంచి దరఖాస్తులు సేకరించి వాటి ప్రకారం మంజూరు చేయాలన్నారు. బహువార్షిక పశు గ్రాసాల లక్ష్యాలను సమయానికి అందించాలని, కేపీఐ ఆధారంగా ప్రతి మండలంలోని పురోగతిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు, డాక్టర్ సుంకవల్లి సత్యనారాయణ, మక్కిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలి


హుకుంపేటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రతి రోజు పనులను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని హుకుంపేట డి-బ్లాక్‌లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులు, గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే రూరల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు జరిగేటప్పుడు ఆక్రమణలు తొలగించడం సహజమని,ఆ క్రమంలో డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ క్రమంలో మురుగునీరు బయటకు పోయేందుకు వీలులేక నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు సమస్యను గోరంట్లకు విన్నవించారు. దీనిపై గోరంట్ల స్పందించి నెల రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామన్నారు. అనంతరం శాటిలైట్ సిటీ సి-బ్లాక్‌లో కల్యాణ మండపం నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, ఏఈ సంపత్‌కుమార్, వాసిరెడ్డి బాబి, పెండ్యాల రామకృష్ణ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లిదుర్గాప్రసాద్, సోమేశ్వరరావు, హీరాసింగ్, చామాండ్రి నాని, ఏఎంసీ డైరెక్టర్ బైరెడ్డి సరోజిని పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులు కీలకం

రాజానగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని వివిధ శాఖలకు చెందిన అధికారులు పేర్కొన్నారు. జిల్లా ఈగల్ సెల్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాజానగరంలోని హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ పాటు పడాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. డ్రగ్స్ బారిన పడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై వచ్చే ప్రభావం, నేరచరిత్ర వంటి అంశాలపై విపు లంగా వివరించారు.మత్తు పదార్థాలకు సంబంధించిన ఏవిధ మైన సమాచారం ఉన్నా 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని, అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఎస్.ఐ నరేష్‌కుమార్, హెచ్‌సీ మధుసూధన్‌రెడ్డి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి బాధ్యతతో కృషి చేయాలి


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు మరింత బాధ్యతతో విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన అనపర్తి బాయ్స్ హైస్కూల్ హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, పులగుర్త హైస్కూల్ హెచ్ఎం కె.సీతామహాలక్ష్మి, పీరా రామచంద్రపురం హైస్కూల్ టీచర్ వి.పద్మశ్రీ, కుతుకులూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లూథర్ పాల్‌లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కుప్పలుతెప్పలుగా సమస్యలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్యం వల్లనే ప్రజా సమస్యలు కుప్పలు తెప్పలు పెరిగాయని వాటిని కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి పరిష్కరించుకుంటూ వస్తున్నామని రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు.ఈ మేరకు మంగళగిరి పార్టీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించినట్టు సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ

కడియం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టరేట్‌కు వెళ్లిన వారిద్దరు కలెక్టర్‌ను కలిసి నర్సరీ రంగంలో నెలకొన్న సమస్యలను వివరించారు.ఏకో టూరిజానికి సంబంధించి,ధవళేశ్వరం నుంచి పొట్టిలంక వరకు బోట్ షికార్‌కు సంబంధించిన విషయాలను చర్చించినట్టు వారు తెలిపారు.

కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోతే నిరసన దీక్ష: టీకే

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోతే తాను నిరసన దీక్ష చేపడతానని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించాలని ఇద్దరు ప్రజాప్రతినిధులు చూస్తున్నారని దీనిని అంగీకరించబోమని అన్నారు.ఎన్నికలు జరగకపోతే పుష్కరాల అభివృద్ధి పనులు సక్రమంగా జరగవని, పాలక మండలి లేకపోతే జావాబుదారీతనం వుండదని అని అన్నారు.

క్రీడా దుస్తుల వితరణ

అనపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన నెస్కో ట్రస్టు ఆధ్వర్యంలో పీరా రామచంద్రపురం హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం శీలా జయరాం పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రను సందర్శించిన రాజ్యసభ సభ్యుడు పాక

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ రాజమహేంద్రవరం పర్యటనలో లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఆయనకు నిర్వాహకుడు గబ్బల రాంబాబు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచాలను ఎంపీ ఆవిష్కరించారు.

ధ్యాన మందిర నిర్మాణానికి ఎమ్మెల్యే వాసు వితరణ


సిమెంట్, ఇనుము అందజేసిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 42వ డివిజన్‌లోని హనుమాన్ ఆలయం వద్ద నిర్మించనున్న ధ్యానమందిర నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వితరణ చేశారు. మంగళవారం ఆలయం వద్ద భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధ్యాన మందిరం నిర్మాణానికి అవసరమైన సిమ్మెంట్, ఇనుప చువ్వలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున ఎన్నో దైవ కార్యక్రమాలు చేస్తున్నామని, దానిలో భాగంగానే ధ్యాన మందిరం నిర్మాణానికి సహకారం అందించామన్నారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కంటిపూడి శ్రీనివాస్, కొయ్యల రమణ, మళ్ల వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

శివకేశవులకు ప్రీతికరం


కార్తీకమాసం సందర్భంగా బిక్కవోలులో విద్యుత్ దీపాలంకరణలో ప్రాచీన ఆలయాలు

- కార్తీక మాసం ప్రారంభం
- గోదావరి రేవుల్లో పుణ్య స్నానాలు
- శివాలయాల్లో భక్తుల పూజలు
- ఆలయాలకు కార్తీక శోభ

రాజమహేంద్రవరం సిటీ/కోరుకొండ/బిక్కవోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శివ, కేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసం ప్రారంభమైంది. శరదృతువులో వచ్చే కార్తీకమాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు కాబట్టి ఈ మాసానికి కార్తీకమాసమని పేరు. మంగళవారం సాయంత్రం అమావాస్య గడియలు ముగిసిన వెంటనే నగరంలోని భక్తులు స్థానిక పుష్కరాల రేవు, కోటిలింగాల రేవులలో కార్తీక స్నానాలు ఆచరించారు.ఈ సందర్భంగా అన్ని శివాలయాలు, విష్ణు ఆలయాలు వద్ద కార్తీక ఆకాశ దీపాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.రాజమహేంద్రవరంలో కోటిలింగాలరేవు, పుష్కరాల రేవు, చింతాలమ్మ ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్‌లను కార్తీక స్నానాలకు సిద్ధం చేశారు. రేవులను శుభ్రం చేసి భక్తుల పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా తయారు చేశారు. మంగళవారం సాయంత్రం, అర్ధరాత్రి దాటాక బుధవారం వేకువజామున కార్తీక స్నానాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో నదీ స్నానాలు చేసి హరి, హరుల దేవాలయాల్లో దీపాలు వెలిగిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో కార్తీక మాసంలో శివాలయాలు, వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు రాజమహేంద్రవరం చేరుకుని పుణ్యస్నానాలు చేసి గోదావరిలో అరటి డొప్పలు, కొబ్బరి చిప్పలు, నిమ్మ డొప్పలు, ఉసిరి కాయలపై దీపాలు వెలిగించి నదీలో విడిచిపెట్టారు. దీపదానాలు, శాలిగ్రామ దానాలు చేశారు. నగరంలోని కోటిలింగాల క్షేత్రం, ఉమామార్కండేయస్వామి ఆలయం,విశ్వేశ్వరాలయం, సర్వేశ్వరాలయం, ఉజ్జయిన మహాకాళేశ్వరాలయం, సారంగధరేశ్వరాలయం. సోమలింగేశ్వరాలయం, ఉమారామలింగేశ్వరాలయంలో భక్తులు స్వామిని దర్శించుకుని దీపాలు వెలిగించారు. దీంతో ఆయా ఆలయాలు కార్తీక శోభతో కళకళలాడాయి. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం నుంచి పంచారామాల దర్శనానికి వెళ్లేందుకు భక్తులు సిద్ధమయ్యారు. అలాగే కోరుకొండ మండలం నర్సాపురం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఆకాశ దీపాలను మద్దాల బాలాజీ, రామలక్ష్మి దంపతులు వెలిగించారు. జంబుపట్నంలో విశ్వేశ్వరస్వామి ఆలయం, కోరుకొండ విశ్వేశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, కాపవరం, పశ్చిమగోనగూడెం, రాఘవాపురం, కోటికేశవరం,గాడాల,గాదరాడ,కణుపూరు శివాలయాల వద్ద కార్తీక ఆకాశ దీపాలను వెలిగించారు.


రాజమహేంద్రవరంలో విద్యుత్ దీపాలంకరణలో కోటిలింగేశ్వరుని ఆలయం

కార్తీకమాస పూజలకు బిక్కవోలు మండలంలోని శివాలయాలు, విష్ణుమూర్తి ఆలయాలు ముస్తాబయ్యాయి. బిక్కవోలులో 1100 యేళ్ల క్రితం తూర్పుచాళుక్యుల కాలంలో నిర్మించిన శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయంలో వున్న గోలింగేశ్వర, పార్వ తిదేవి, రాజరాజేశ్వరి సమేత రాజేశ్వరస్వామి,బాలాత్రిపుర సుం దరి సమేత చంద్రశేఖరస్వామి వార్ల దర్శనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు క్షేత్రపాలకులైన లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని కూడా భక్తులు దర్శనాలకు సిద్ధం చేశారు. కార్తీకమాసంలో వచ్చే ప్రతి సోమవారం గోలింగేశ్వరస్వామికి లక్ష ల్వార్చన, పార్వతిదేవి లక్ష కుంకుమార్చన జరుపుతామని కార్యనిర్వహణాధికారి పేర్కొన్నారు.



కార్తీక మాసం ప్రారంభానికి సూచనగా కోరుకొండ మండలం నరసాపురంలో ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న దంపతులు(పైన), రాజమహేంద్రవరంలో ఆకాశదీపం వెలిగిస్తున్న దృశ్యం (కింద)

వెలుగు దివ్వెలు

- ఘనంగా దీపావళి వేడుకలు
- లక్ష్మీదేవికి దీపారాధన, పూజలు
- ఇళ్ల వద్ద బాణసంచా కాల్పులు


స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ/గోకవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలు రాజమహేంద్రవరంలో అత్యంత ఘనంగా జరిగాయి. ప్రజలు ఇళ్లను శుభ్రం చేసుకొని రంగవల్లులు తీర్చిదిద్దారు. తలంటు స్నానాలు చేసి సాంప్రదాయ దుస్తులు ధరించి స్థానిక దేవాలయాల్లోనూ, సాయంత్రం తులసికోట, లక్ష్మీదేవి చిత్రపటాల వద్ద ప్రత్యేక దీపారాధన, పూజలు చేశారు. ఇంటి ఆవరణను ప్రమిదల్లో నూనె పోసిన దీపాలతోను, రంగు రంగుల విద్యుద్దీపాలతోను సుందరంగా అలంకరించారు. లక్ష్మీదేవికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దివిటీలు ఆనవాయితీ ఉన్నవారు దివిటీలు కాల్చారు.అటుపై కుటుంబ సభ్యులు మిఠాయిలు తినిపించుకుని టపాసులు కాల్చారు. నగరంలో రాత్రి 7:30గంటల వరకు పెద్దగా కాల్పులు కనిపించలేదు.అటుపై భారీగా బాణసంచా కాల్చారు. ఆకాశ దీపాలు వదిలారు. ఇంటి ముంగిట మతాబులు, చిచ్చుబుడ్లు, టపాసులు, వెలిగించి ఆనందం పొందారు. వీధుల వెంబడి నాలుగురోడ్ల కూడలి వద్ద షార్ప్స్, తారాజువ్వలు, థౌజండ్ వాలా నుంచి 20 థౌజెండ్ వాలా వరకు కాల్చారు. కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. నగరంలో పలువురు మర్వాడీలు,రాజకీయ నాయకులు బాణసంచా గిఫ్ట్‌లను పేదలకు, అనాథలకు అందించి వారితో దీపావళి చేసుకున్నారు. అలాగే నగరంలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు గుబ్బల రాంబాబు వృద్ధులతో దీపావళి వేడుకలు నిర్వహించారు. బాణసంచా కాల్పించారు. వారికి పండుగ సందర్భంగా ప్రత్యేకంగా విందు భోజనం అందించారు.

నోట్లతో రాజరాజేశ్వరిదేవికి పూజలు

బిక్కవోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని జువ్వలదొడ్డిలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి పీఠంలోని అమ్మవారికి దీపావళి సందర్భంగా సోమవారం రాత్రి కరెన్సీ నోట్లతో పూజలు చేశారు. పీఠాధిపతి దేవరభొట్ల ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రియదర్శినిలో వేడుకలు..

కడియం అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రియదర్శిని చెవిటి, మూగ విద్యార్థుల ఆశ్రమంలో బుర్రిలంక చిరుసేవా సమితి అధ్యక్షుడు, జనసేన నాయకుడు గెడ్డం శివరత్న గణపతి ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు జరిగాయి. దీనికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి చిన్నారులతో కలిసి దీపావళి నిర్వహించారు. గణపతి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, చిరుసేవా సమితి సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ముసలమ్మతల్లికి 160 కిలోల నైవేద్యం

కడియపులంక గ్రామంలో దీపావళి సందర్భంగా గ్రామ దేవత ముసలమ్మతల్లిని ధనలక్ష్మిదేవిగా అలంకరించి 160 కిలోల తీపి నైవేద్యాన్ని భక్తులు సమర్పించారు. ఐదు సంవత్సరాలుగా అమ్మవారిని దీపావళి రోజున ధనలక్ష్మిగా అలంకరిస్తున్నట్టు ఆలయ కమిటి తెలిపింది. భక్తులు వివిధ రకాల తీపి పదార్థాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.


ముసలమ్మతల్లికి సమర్పించిన నైవేద్యం

నటుడు రాజబాబు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్య నటుడు రాజబాబు 89వ జయంతి సోమవారం ఆయన తమ్ముడు బాబి ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ 1960లో సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన రాజబాబు 1982 వరకు 550 చిత్రాల్లో నటించి, ఎన్నో అవార్డులు అందుకుని, తెలుగువారి గుండెల్లో,చిరంజీవిగా నిలిచిపోయారన్నారు.కార్యక్రమంలో రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, మునిని వెంకటేశ్వరరావు, కట్టా చంద్రరావు, బొమ్మల సత్యబాలాజీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సీతానగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నంలోని సాధన మహిళా మండలి ఆశ్రమంలో మహిళా మండలి ఛైర్‌పర్సన్ పి.సుజ్ఞానకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం, రమాడెంటల్ కేర్, మదర్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ ఎండీ డా. ఉషాకిరణ్, డా. సౌమ్య ,డా.పవన్‌కుమార్, వైద్య పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చుకు వైసీపీ యత్నం

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా అరాచకంతో ప్రజలను నానా ఇబ్బందుల పాల్జేసిన వైసీపీ ఇవాళ కులాల మధ్య చిచ్చు పెట్టే నీచ రాజకీయాలకు ఒడిగడుతోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరి సంఘటన పట్ల కూటమి నేతలంతా దిగ్భ్రాంతి చెందారు.ఆ కుటుంబానికి అండగా నిలిచారని, కానీ పరామర్శల పేరుతో వైసీపీ కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగానే ఉన్నాయని, పోలీసు యంత్రాంగం అసాంఘిక కార్యక్రమాలను నియంత్రణ చేస్తోందని, కానీ వైసీపీ సొంత అజెండాతో వ్యవహరిస్తోందని అన్నారు.వైసీపీ హయాంలో ప్రజలను హింసించారని, హత్యలు జరిగాయని, కానీ జగన్ తన ప్యాలస్‌ను వదిలి బయటకు రాలేదని విమర్శించారు. అంబటి రాంబాబు గురించి అందరికీ తెలుసని, ఇరిగేషన్ మంత్రిగా పోలవరంలో గంప మట్టి వేయలేదని, కేవలం సంబరాలు చేసుకోవడానికి ఆయన మంత్రి పదవి చేపట్టారన్నారు.పంటలు ఎండిపోయినా, రైతుల ఆత్మహత్యలు జరిగినా పట్టించుకోలేదని, పవన్‌ను తిట్టడమే ఆయన పనియని, ఇరిగేషన్ శాఖకు ఆయన బాధ్యతగా వ్యవహరించలేదని అన్నారు.జక్కంపూడి రాజా కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా కాపులకు ఒక్క లోనైనా ఇచ్చారా, విదేశీ విద్య కోసం రుణం ఇచ్చారనా అని ఎమ్మెల్యే బత్తుల ప్రశ్నించారు. కాపులను ఏమీ ఉద్ధరిం చరించారని నిలదీశారు.

కులాలను విడగొట్టేందుకు ప్రయత్నం: అనుశ్రీ

రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలను, కులాలను కలుపుకుని అందరి బాగా చూడాలని కూటమి ప్రభుత్వం పని చేస్తుంటే వైసీపీ మాత్రం ప్రజలను విడగొట్టి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని జనసేన పార్టీ రాజమండ్రి అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుశ్రీ(అత్తి) సత్యనారాయణ విమర్శించారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి, ఆ మంట ల్లో చలి కాగాలని చూస్తోందన్నారు. కందుకూరి సంఘటనను శవ రాజకీయం చేయవద్దని మృతుడి భార్య కోరగా, శవరాజకీయ పార్టీ అయిన వైసీపీ శవరాజకీయమే చేస్తోందని మండిపడ్డా రు. వైసీపీ అధినేత జగన్, బఘూన్, సంబరాల అంబటి రాంబాబు, కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ జక్కంపూడి రాజా శవ రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తు న్నారని అనుశ్రీ విమర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనుశ్రీ

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

కోరుకొండ సీఐ సత్యకిషోర్

గోకవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీ రుల త్యాగాలు మరువలేనివని సీఐ వై.సత్య కిషోర్ అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం గోకవరం ప్రధాన రహదారిపై కేవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డిపోనుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతియుత సమాజం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రసాద్, ట్రైనీ ఎస్ఐ నాగమణి పాల్గొన్నారు.


గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలోని సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో అమరవీ రుల స్థూపానికి అధికారులు పుష్పగుచ్ఛాలతో అంజలి ఘ టించారు. అనంతరం కమాండెంట్ ధర్మప్రకాశ్ మాట్లాడు తూ ఆనాటి సీఆర్పీఎఫ్ జవానుల త్యాగాన్ని గుర్తుచేశారు. పోలీసు దళాల ధైర్యం, అంకితభావానికి వారు నిదర్శనమ న్నారు. అమరులైన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లను చదివి వినిపించారు.

కోరుకొండ: కోరుకొండలో పోలీసులు ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీసుస్టేషన్ నుంచి నరసింహస్వామి దేవస్థానం, మెయిన్‌బజార్, పాండురంగ స్వామి గుడి, గాంధీచౌక్, పంచాయతీ కార్యాలయం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ చేరుకుని అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వై.సత్యకిషోర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎందరో పోలీసులు ప్రాణాలు కోల్పోయారని అమరవీరుల సేవలను ప్రజలకు గుర్తు చేస్తూ వారి కుటుంబాలకు సంఘీభావం తెలియజేయడానికి ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 22 అక్టోబరు 2025 | 5





కార్తీకం..శివోహం

నేటి నుంచి కార్తీకమాసం - జిల్లాల్లో ఎన్నో శైవక్షేత్రాలు

రాజమహేంద్రవరం సిటీ/బిక్కవోలు/కొవ్వూరు,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాదులు అనంతమైన పుణ్య ఫలాలు ఇస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.అందుకే ఈ మాసమంతా ఆధ్యాత్మికతే కనిపిస్తుంది.మాలధారణలు, సంప్రదాయాలు ఉట్టిపడతాయి. ఏ శైవ క్షేత్రానికి వెళ్లినా ఓం నమశ్శివాయ అనే శివపంచాక్షరీనామమే ప్రతిధ్వనిస్తుంది. శరదృతువులో వచ్చే కార్తీకమాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు కాబట్టి కార్తీకమాసమని పేరు వచ్చిం దని చెబు తుంటారు. కార్తీకమాసం శివకేశవులు ఇద్దరికీ ప్రీతి దాయకం.కార్తీకమాసంలో ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.ఈ మాసంలో వనసమారాధనలు జరుగుతాయి.

ఆలయాలివిగో..

- ఈ మాసంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి తీరం చాలా ప్రత్యేకం. తెల్లవారుజామునే మహిళా భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరిస్తారు.నదిలో దీపాలు వదులుతారు. అక్కడే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. గోదావరికి అటువైపున ఉన్న కొవ్వూరులోను తెల్లవారుజామున స్నానాలు, ఆచరిస్తారు.బిక్కవోలు, కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరంలో కార్తీకమాసంలో దర్శించదగ్గ ఆలయాలున్నాయి. బిక్కవోలులో 1100 ఏళ్ల కిందటి గోలింగేశ్వరస్వామి ఆలయం, ఇళ్లపల్లిలోని 108 స్తంభాల గుడి, బలభద్రపురంలోని శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు చూడవచ్చు. ధవళేశ్వరంలో అగస్త్యేశ్వరుడు, రాజమహేంద్రవరంలో మార్కండేశ్వరుడు, ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.ఇటీవలే నిర్మించిన ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం.
- కాకినాడ జిల్లాలోని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం కార్తీకానికి ముస్తాబైంది. సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, అన్నవరం సత్యదేవుడి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం, ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరస్వామి, కె.గంగవరం మండలం కోటిపల్లి, పంచారామల్లో ఒకటైన ద్రాక్షారామ, కొత్తపేట మండలం పలివెల కొప్పేశ్వరుడు,అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలోని వ్యాఘ్రేశ్వరస్వామితో పాటు ఏకా దశరుద్రులుగా పేరుగాంచిన 11 ఆలయాలు దర్శించుకుంటే పుణ్యఫలమని ప్రతీతి.

నేటి నుంచి ఆరంభం

ఈ ఏడాది కార్తీకం బుధవారం ప్రారంభమై వచ్చే నెల 20న ముగుస్తుంది. ఈ మాసంలో ప్రతిరోజూ ఓ పండుగే. నాలుగు సోమవారాలతోపాటు కార్తీకపౌర్ణమి ఎంతో విశిష్టమైనవి. అట్లతద్ది వాయినాలు తీర్చుకోలేని వారు సోమవారం పౌర్ణమి నాడు తీర్చుకుంటారు. ఈనెల 23న యమ విదియ. ఆ రోజున సోదరి ఇంట సోదరులు భోజనం చేసి కానుకలు ఇచ్చి రావాలి. 25న నాగులచవితి. పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుని ఆరాధిస్తారు. 30న గోపాష్టమి, నవంబరు 2న చిలుక ద్వాదశిని పురస్కరించుకుని క్షీరాబ్ది పూజ చేస్తారు. 4న వైకుంఠ చతుర్దశి, 5న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం. 18న మాసశివరాత్రి, 21న పోలిస్వర్గం, పాడ్యమి దీపాలు విడిచిపెడతారు.



ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులకు పురస్కారం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

జీఎస్టీ వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ఇటీవల నిర్వహించిన సూపర్ జీఎస్టీ 2.0 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు సీఎం చంద్రబాబు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. జీఎస్టీ విధానం, పన్ను తగ్గింపుతో కలిగే ప్రయోజనాలపై చర్చించే అవకాశం పొందారు. థర్డ్ బీకాం (అకౌంటింగ్) చదువుతున్న టి.రేఖ కుమారి హిందీ వక్తృత్వం, థర్డ్ బీఏ (ఎకనామిక్స్) చదువుతున్న పి.సాయి అపర్ణ ఇంగ్లీష్ వక్తృత్వ పోటీల్లో మంచి ప్రతిభ చూపించి ప్రథమస్థానంలో నిలిచారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ రామచంద్ర, వాణిజ్యవిభాగాధిపతి సత్యనారాయణ, వాణిజ్యశాస్త్ర అధ్యాపకురాలు ప్రతిమ, ఆర్థికశాస్త్ర విభాగాధిపతి బాలయ్య అభినందించారు.



కాలిన.. కాలుష్యం!

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

దీపావళి అంటే సందడే సందడి. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు.ఈ దీపావళి పండగకు ఉమ్మడి జిల్లాలో బాణ సంచా మోతమోగింది. జువ్వలు, బాంబులు, చిచ్చుబుడ్లు, లక్ష్మీ టపాసులు పేలాయి. రంగురంగుల మందు గుండు నిప్పులు చిమ్ముతూ పొగలుకక్కాయి. పండగ సంతోషంతో జనం ఎక్కడికక్కడ మందుగుండు భారీగా పేల్చారు. ఒక్కసారిగా పేలిన టపాసులతో గాల్లో కాలుష్యం తీవ్రత పెరిగింది. పొగ నిండిపోయి గాలి నాణ్యత దెబ్బతింది. ముఖ్యంగా సోమవా రం రాత్రి 7 గం టల నుంచి అర్ధరాత్రి 12 గం టల వరకు గాలి నాణ్యతను సూచించే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా రెడ్‌సిగ్నల్‌లోకి చేరింది. బాణ సంచావల్ల అత్యధిక కాలుష్యం అమలా పురంలో నమో దైంది.

అమలాపురాన హై...

ఉమ్మడి జిల్లా మొత్తం మీద అమలాపురం పట్టణంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. వాయుకాలుష్యం అత్యధికంగా ఇక్కడే నమోదైంది. పండగరోజు సోమవారం సాయం త్రం ఆరు గంటలకు ఏక్యూఐ 65 నుంచి ఏకంగా 138కి చేరింది. రాత్రి 7 గంటలకు 229, 8 గంటలకు 243, 9 గంటలకు 222, 10 గంటలకు 212, 11గంటలకు 198, అర్ధరాత్రి 12గంటలకు 164 నమోదైంది. తిరిగి మంగళ వారం 11గంటల తర్వాత వాయు కాలుష్య తీవ్రత తగ్గిపోయి తిరిగి 56కి చేరింది.

రాజమండ్రిలో ఇలా..

రాజమహేంద్రవరంలోను వాయు కాలుష్యం భారీగా వెదజల్లింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఏక్యూఐ 82గా నమోదైంది. 6 గంటలకు 121, 7గంటలకు 196, 8 గంటలకు 212, 9గంటలకు 199, 10 గంటలకు 197, 11గంటలకు 198, 12గంటలకు 164 చొప్పున నమోదైంది.మంగళవారం ఉదయం 10గంటల తర్వాత 62కి చేరింది.

కాకినాడలో కాస్త బెటర్

కాకినాడ నగరంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఏక్యూఐ 156 ఉండగా, 7గంటలకు 174, 8గంటలకు 173, 9 గంటలకు 164, 10 గంటలకు 167, 11 గంటలకు 166, 12గంట లకు 151 నమోదైంది. అర్ధరాత్రి ఒంటిగంటకు 138, 2గంటలకు 103 నమోదవగా ఉదయం 8 గంటలకు తిరిగి 66కి చేరి గాలి నాణ్యత మెరుగైంది.

పొగ 'మోతెక్కింది'

- హోరెత్తిన బాణసంచా పేలుడు
- ప్రమాదకర స్థాయికి చేరిక
- అమలాపురాన ఏక్యూఐ 243
- రాజమహేంద్రవరంలో 212
- కాకినాడ నగరంలో 174
- 100 దాటితే శ్వాస ఆడదు

స్వచ్ఛమైన గాలి లేదు!

గాలిలో నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఆధారంగా కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు రూ పొందించింది. ఏ క్యూఐ సంఖ్య 50 పాయింట్లలోపు ఉంటే అక్కడ గాలి నాణ్యత బాగుం దని అర్థం. 50 నుంచి 100 వరకు ఉంటే మోడరేట్, 100 నుంచి 150 వరకు ఉంటే పూర్, 150 నుంచి 200మధ్య ఉంటే అన్‌హెల్తీ వాతా వరణం కింద భావించాలి. పండగ రోజు రాత్రి కాకినాడ,అమలాపురం, రాజమహేంద్రవరంలో వాయుకాలుష్య తీవ్రత పెరిగిపోయింది. ఏక్యూఐ 100 దాటితే ఆస్తమా, కిడ్నీ, గుండె జబ్బులతో బాధపడుతున్న వారు శ్వాస తీసు కోవడం ఇబ్బందిగా మారుతుంది. ఏక్యూఐ 200 దాటితే శ్వాస సమస్యలు ఎదుర్కొంటారు.ఎందుకంటే మందుగుండు పేలుడుతో వెదజల్లే వాయు కాలుష్యంలో కార్బన్ డయాక్సైడ్, నైట్రోజెన్ డయా క్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ మోతాదు అధికం. దీనివల్ల శ్వాస సమస్యలు వస్తాయి.దీపావళి రోజు రాత్రి ఏకంగా అమలాపురం, రాజ మహేంద్రవరంలో ఏ క్యూఐ 200 పాయింట్లు దాటేసింది.

రాయవరం అగ్ని ప్రమాద మృతులకు సాయం

8

456 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 456 మంది ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది.ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో మంగళవారం ఆర్టీసీ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. త్వరలోనే పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేస్తామని పదోన్నతుల కమిటీ చైర్మన్ రాఘవకుమార్ తెలిపారు.

రేపు బాధ్యతలు స్వీకరించనున్న తెలుగు వర్శిటీ వీసీ

రాజమహేంద్రవరం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం లోని పొట్టిశ్రీరాములు తెలుగు వర్శిటీ తొలి వైస్ చాన్సలర్‌గా నియమితులైన డి.మునిరత్నం నాయుడు గురువారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ మేరకు బొమ్మూరు తెలుగు వర్శిటీ ఆవరణ శుభ్రం చేయించే పనులు ఆరంభమయ్యాయి.వర్శిటీ భవనాలన్నీ శిథిలావస్థకు చేరిన సంగతి తెలిసిందే.



మీ త్యాగం స్ఫూర్తిదాయకం : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ కీర్తి, ఎస్పీ నరసింహ కిశోర్, పోలీసులు తదితరులు.. హాజరైన పోలీస్ అమరుల కుటుంబీకులు

పోలీసుల సేవలు అమూల్యం

పోలీస్ అమర వీరుల దినంలో మంత్రి దుర్గేశ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు కీలకమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల దినం మంగళవారం ఎస్పీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ అమరవీరుల స్మారకస్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన 191 మంది అమరుల వీరోచిత సేవలను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. కుటుంబం కంటే ప్రజారక్షణకే అధిక ప్రాధాన్యం ఇచ్చే పోలీస్ సేవలు అమూల్యమన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న లద్దాక్ ప్రాంతంలో చైనా సైన్యం చొచ్చుకొస్తుంటే అతి కొద్ది మంది మాత్రమే ఉన్న మన జవానులు వీరోచితంగా పోరాడి వాళ్లను వెనక్కు తరిమి వీరమరణం పొందారన్నారు.వారి సేవా స్ఫూర్తి, ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల దినం నిర్వహించుకుంటున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల దినం ప్రతి పోలీస్‌కు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జేసీ మేఘ స్వరూప్, అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం.మురళీ కృష్ణ, ఏవీ.సుబ్బరాజు,చెంచిరెడ్డి, డీఎస్పీలు రామకృష్ణ, దేవ కుమార్, శ్రీకాంత్, విద్య, భవ్యకిషోర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో పడకేసిన వైద్యం

- 37 పీహెచ్‌సీల్లో వైద్యుల సమ్మె
- 17 మంది సమ్మెకు దూరం
- వైద్యం అందక ప్రజలు విలవిల



(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

మెడికల్ ఆఫీసర్ల సమ్మెతో జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యం పడకేసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు చెబుతున్నప్పటికీ మంగళవారం వైద్యులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో స్టాఫ్ నర్సులే వైద్యులుగా వ్యవహ రించడం గమనార్హం. సెప్టెంబరు చివరి వారం నుంచి మెడికల్ ఆఫీసర్లు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో మాదిరిగా పీజీ సీట్లలో వెయిటేజీ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా 37 పీహెచ్‌సీల వద్ద డాక్టర్లు సమ్మె ఆరంభించారు. జిల్లాలో 37 పీహెచ్‌సీల్లో 20 మంది డాక్టర్లు సమ్మె చేస్తుండగా 17 మంది సమ్మెకు దూరంగా ఉన్నారని జిల్లా అధికారులు చెబు తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా రాజమహేంద్రవరం మెడికల్‌కాలేజీకి చెందిన సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు పలు బాధ్యతలు అప్పగించారు.స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బం దితో కలుపుకుని సుమారు 200 మందికి మూడు షిఫ్టులుగా డ్యూటీలు కేటాయించినట్టు తెలిపారు.వీరికి ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ ఒకషిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటలకు వరకూ మరో షిఫ్ట్, రాత్రి 8 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకూ మరో షిఫ్ట్ కేటాయించారు.రెస్పాన్సిబుల్ సూపర్‌వైజర్స్‌గా కొంతమంది, ఐదుగురు ప్రోగ్రామ్ ఆఫీసర్లను నియమించారు.దీపావళి ముందు రోజు కొందరు పీహెచ్‌సీలను పట్టించుకోలేదు.దీపావళి రోజు సుమారుగా మూసేసినట్టే. ఇక మంగళవారం వైద్యులెవరు హాజరు కాలేదు. దీంతో స్టాఫ్ నర్సులే సర్వం చూస్తుండడం గమనార్హం.జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యం పడకేసింది. సబ్ సెంటర్లదీ ఇదే పరి స్థితి. వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

30 వరకు ఈ-క్రాప్ నమోదు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రబీ సీజన్‌కు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో 3,214 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. రాబోయే రబీ సీజన్‌లో వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 55 వేల మెట్రిక్ టన్నులు అవసరమన్నారు. జిల్లాలో వరి ఈ పంట నమోదు 100 శాతం పూర్తయిందన్నారు. ఇతర పంటలను కలుపుకుని మొత్తం 62 శాతం నమోదైందన్నారు. అక్టోబరు 30 నాటికి 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు 212 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఎంపీడీవోలు, కమిషనర్లు సంక్షేమ హాస్టళ్లను సందర్శించాలన్నారు.

ఆరు లేన్లగా హైవే విస్తరణ

అధికారులతో సమీక్షించిన ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివాన్‌చెరువు నుంచి అనకాపల్లి వరకూ 16వ నంబరు జాతీయ రహదారిని ఆరులేన్లగా విస్తరించనున్నారని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె ఎన్‌హెచ్ 16 విస్తరణ పనులపై సమీక్షించారు.జాతీయ రహదారుల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. దివాన్‌చెరువు- అనకాపల్లి ఆరు లేన్ల విస్తరణ ప్రాజెక్టు తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. 2027 పుష్కరాలను దృష్టి ఉంచుకుని రహదారి పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 11 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు జరగనున్నాయన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.కృష్ణమూర్తి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.160.245 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరిస్తామన్నారు. రాజానగరం మండలంలో ఈస్ట్ గోనగూడెం, కల్వచర్ల, రాజానగరం,జగన్నాథపురం, వెంకటాపురం, నరేంద్రపురం, వెలుగుబంద జంక్షన్ మీదుగా దివాన్ చెరువు వరకూ ప్రాజెక్టు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ విశాఖ - రాజమహేంద్రవరం ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గ్రామన్ బ్రిడ్జి నుంచి రాజమండ్రి, రాజానగరం వెళ్లే రహదారి మార్గంలో రూట్ డైవర్షన్‌కు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జేసీ వై.మేఘ స్వరూప్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఆర్వో టి.సీతారామమూర్తి, టెక్నికల్ మేనేజర్ వివి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోదారి ఇలాగైతే ఎలా మరి!

కార్తీకమాసం వచ్చేసింది.. గోదావరి చూస్తే తగ్గుముఖం పట్టింది.. ఎంతలా అంటే మెట్ల దిగువకు వెళ్లిపోయింది.. కోటిలింగాల ఘాట్‌లో చూస్తే మరీ అధ్వానంగా ఉంది.. కనీసం గోదావరిలో దిగి స్నానం చేసేందుకు .. దీపాలు వదిలేందుకు అవకాశం లేకుండా ఉంది.. జల్లు స్నానం ఏర్పాటు చేయకపోతే భక్తులకు ఇబ్బందులు తప్పవు.. ఇకనైనా అధికారులు స్పందించి రేవులను శుభ్రం చేయాల్సి ఉంది. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



నిడదవోలులో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

ఆపదలో అండగా సీఎం సహాయ నిధి

● సీఎంఆర్ చెక్కుల పంపిణీలో మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఈరోజు 49మంది బాధితులకు 22.44 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు అందించామని ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో 437మందికి 3.32కోట్ల రూపాయలు అందించామన్నారు. సీఎం సహాయనిధి పేదలకు వరమని పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా ఇస్తుందన్నారు. ఏ చిన్న అప్లికేషన్ వచ్చినా సీఎం చంద్రబాబు వెంటనే ఆమోదిస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారని అన్నారు. నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకి, వైద్యానికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం మండలంలో తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం గ్రామాలకు చెందిన ఎన్టీఆర్ వైద్యసేవలో లబ్ధి పొందని ముగ్గురు లబ్ధిదారులకు రూ.1,37000 చెక్కుల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దాదు ర్ఘరావు, నామన పరమేశ్వరరావు, కైగాల శ్రీనివాసరావు, అన్నమరెడ్డిరమణ, అన్నమరెడ్డి సత్తిబాబు, కోడి శంకరం, బోడపాటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

బాణసంచా పేలుడులో మృతుల ఒక్కొక్కరికి

రూ.15 లక్షల పరిహారం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తిలో బాణసంచా మృతుల కుటుంబాలకు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వి.సావరం, బిక్కవోలు మండలం కొమరిపాలెం సరిహద్దుల్లోని లక్ష్మీగణపతి ఫైర్‌వర్క్స్‌లో ఈనెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు మంగళవారం ప్రకటించారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తాను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనడంతోపాటు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. కర్నూలులో ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో కమిటీ విచారణ కొంత ఆలస్యం అయినప్పటికీ మంగళవారం నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారన్నారు. ఈ ప్రమాదంలో యజమాని సహా పది మంది మృతి చెందారని, ఈ ఘటనను వైసీపీ నాయకులు రాజకీయం చేయాలని ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాలకు సరైన పరిహారం అందించేందుకు సీఎం ఒప్పించడంలో మంత్రులు సుభాష్, అనిత, ఎమ్మెల్యే జోగేశ్వరరావు తనతోపాటు కృషి చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్మిక శాఖ నుంచి ఈ పరిహారం త్వరలోనే బాధిత కుటుంబాలకు అందజేస్తామని, అలాగే యజమాని తరఫున కూడా పరిహారం అందేవిధంగా కృషి చేస్తామన్నారు. పది మంది మృతుల్లో అనపర్తి నియోజకవర్గానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి చెందినట్లు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ముమ్మిడివరపు చిట్టెమ్మ (49) ఈనెల 20వ తేదీన పెనకనమెట్ట గ్రామంలో కూలిపనికి వెళ్లి ఇంటికి తిరిగి బయలుదేరింది. ధర్మవరం దుర్గమ్మ గుడికి వచ్చేసరికి ట్రాక్టర్, ట్రక్కు ఢీకొని ఆమెపై నుంచి వెళ్లిపోయాయి. ఈ ప్రమాదంలో చిట్టెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతురాలి కుమారుడు ముమ్మిడివరపు రాజు అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



మృతుడు అక్కాబత్తుల మహేశ్

గోపాలపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలుజారి మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారు పిచ్చుకగండి సమీపంలోని సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మనోహర్ తెలిపి వివరాల మేరకు గోపాలపురంలో పెద్దాగూడెం గ్రామానికి చెందిన అక్కాబత్తుల మహేశ్(19) సోమవారం ఉదయం చేపలవేటకు వెళ్లాడన్నారు. అయితే చేపలు వేటాడే సమయంలో ప్రమాదవశాత్తూ కాలుజారి అండర్ కెనాల్ లోపడి చనిపోయినట్లు తెలిపారు. దీనిపై మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి


● నలుగురి అరెస్టు

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపైదాడిచేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మండలంలోని వాడపల్లి గ్రామంలో గోదావరి ఏటిగట్టు కింద స్థలంలో మంగళవారం ఉదయం పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సీఐ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి, వారి వద్ద నుంచి రూ.2160ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల పనులలో భాగంగా బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు కాకరపర్రు పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ యథావిధిగా ఇస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ అప్పారావు తెలిపారు. అదేవిధంగా ఖండవల్లి పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పనులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వ్యవసాయ విద్యుత్ యథావిధిగా ఉంటుందని తెలిపారు.

టీడీపీ నాయకుడు బలరామ్మూర్తి మృతి



చాగల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణగూడెంకు చెందిన టీడీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసరావు తాతయ్య బలరామ్మూర్తి (95) సోమవారంరాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆయన మనవరాలు, శ్రీనివాసరావు భార్య విజయదుర్గ మండల జెడ్పీటీసీ సభ్యురాలు. ఆయన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. గ్రామంలోని భజన సంఘాలకు గురువుగా సేవలందించారు. మంగళవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో గ్రామస్థులు పలువురు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

● కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అశువుల బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్నిపురస్కరించుకుని పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక విజయవిహార్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. సీఐ మాట్లాడుతూ అక్టోబరు 21నుంచి ప్రతీ ఏడాది పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. వారంరోజులపాటు సేవాకార్యక్రమాలు, రక్తదానాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు, ఏఎస్ఐలు జి.శ్రీనివాసరావు, జె.ధర్మరాజు, హెచ్‌సీలు ఆర్.సాంబమూర్తి, ఆర్.భగవాన్‌దాస్, సీహెచ్ బాబూరావు, ఆర్.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, పీసీలు రాజశేఖర్, ఆర్.కె.సత్యనారాయణ, గణేష్, జయరామ్, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొడ్డు రామకృష్ణ కుటుంబానికి ఎంపీ పరామర్శ





వెదుళ్లకుంటలో బీజేపీ నాయకుడు బొడ్డు రామకృష్ణ పరమహంస కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ పురందేశ్వరి, చాగల్లులో బీజేపీ నాయకుడు గణపతి కుటుంబ సభ్యులను పరామర్శించిన పురందేశ్వరి

గోపాలపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వెదుళ్లకుంట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బొడ్డు రామకృష్ణ పరమహంస (73)ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు బొడ్డు వీరరాఘవులు రాష్ట్ర బీజేపీ కార్యవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన కుటుంబాన్ని రాజమహేంద్రవరం పార్లమెంటు మెంబర్ దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు, సొసైటీ చైర్మన్‌లు వడ్లమూడి రమేశ్, సుబ్బరాజు, టీడీపీ నాయకులు జొన్నలగడ్డ ప్రసాద్, రైతు కార్యదర్శి జ్యేష్ట శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, సమన్వయ కమిటీ సభ్యులు వేముల నాగరాజు, బీజేపీ నాయకులు గెల్లా శ్రీనుబాబు, దేవిన శ్రీను, నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, యండ్రప్రగడ మంగారావు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

చాగల్లు(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వారి మంచి జరిగిందని ఎంపీ పురందరేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన చాగల్లుకు చెందిన జుట్ట గణపతి సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల సంక్షేమం, దేశ భద్రత లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు తాళ్ళూరి వరప్రసాద్, ఏఎంసీ అధ్యక్షుడు నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, బీజేపీ నాయకులు బూసి సురేంద్రనాద్ బెనర్జీ, గ్రంధి రాంబాబు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘మంత్రి దుర్గేష్‌పై అసత్య ప్రచారం తగదు’

ఉండ్రాజవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కందులదుర్గేష్ నిడదవోలు నియోజకవర్గంలో కూటమి ధర్మాన్ని పాటించడంలేదని టీడీపీ నాయకులు ఆరోపించినట్లుగా ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తను అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు కటకం రామకృష్ణ, జనసేన నాయకులు తిర్రే రవిదేవా ఖండించారు. మంగళవారం ఉండ్రాజవరంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆ వార్తా ఛానల్‌లో వచ్చిన వార్తలో వాస్తవం లేదని, మంత్రి దుర్గేష్‌పై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. మంత్రి దుర్గేష్ కూటమి ధర్మాని పాటిస్తూ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్నట్లు వారు తెలిపారు. టీడీపీ కార్యకర్తలకు అత్యధిక నామినేటెడ్ పదవులు, ముఖ్యమైన పదవులు ఇస్తున్నట్లు వారు వివరించారు. నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ వారికే ఏఎంసీ పదవి ఇచ్చారని, నియోజవర్గంలో కూటమి నాయకుల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు వారు తెలిపారు. మంత్రిపై విమర్శలుమాని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రామకృష్ణ, రవిదేవా పేర్కొన్నారు. పి.చిన్నారావు, అంజిబాబు పాల్గొన్నారు.

మందుగుండు సామగ్రి పంపిణీ

పెరవలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పిల్లలందరికీ వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కరరావు, తదితర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉచితంగా మందుగుండు సామగ్రి పంపిణీ చేశారు. సుమారు వంద మందికిపైగా పిల్లలకు ఈ టపాసులు ఉచితంగా అందజేశారు.

ఉపాధి పనులపై గ్రామసభ

పెరవలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కానూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పై సర్పంచ్ భావన మధు అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. 2025-26కి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధిహామీ కింద కొత్త పనులు, ప్రతిపాదనలు, పాత పనుల సమీక్ష తదితర విషయాలపై చర్చించారు.

కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోతే నిరసన దీక్ష: టీకే

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకపోతే తాను నిరసన దీక్ష చేపడతానని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించాలని ఇద్దరు ప్రజాప్రతినిధులు చూస్తున్నారని దీనిని అంగీకరించబోమని అన్నారు.

అధ్వానంగా దేవరపల్లి-పల్లంట్ల రోడ్డు

● పట్టించుకోని అధికారులు, నాయకులు

దేవరపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి, పల్లంట్ల రోడ్డు పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ రోడ్డు పరిస్థితి అలాగే ఉంటుంది. దేవరపల్లి నుంచి పల్లంట్ల, కురుకూరు రోడ్డు పెద్దపెద్ద గుంతలు, బురదమయంకావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, మోటర్‌సైకిళ్లు, స్కూల్‌బస్సులు, ఆర్టీసీ బస్సు ఈ మార్గం గుండా నిడదవోలు, దేవరపల్లి వెళుతుంటాయి. కొన్ని వాహనాలు పెద్దపెద్ద గోతుల్లో పడి నిలిచిపోవడం వాహనాలకు రిపేర్‌రావడం, గోతుల్లో పడిపోవడంతో ద్విచక్ర వాహనదారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర గాయాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రజాప్రతి నిధులు, అధికారులు వెంటనే స్పందించి వెంటనే గోతులు పూడ్చి పక్కాగా తారురోడ్డు వేయాలని గ్రామస్థులు, ప్రజలు కోరుతున్నారు.



గోతులమయంగా మారిన దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో ఇబ్బందులుపడుతూ వెళుతున్న వాహనచోదకులు

కరువుభత్యం జీవోలు సవరించాలి

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు



తాళ్లపూడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన కరువు భత్యం ఉత్తర్వులు 60, 61లో వాయిదాల చెల్లింపులో రిటైర్డ్ ఉద్యోగుల పట్ల చూపిన వివక్షతను తొలగించి సవరణ ఉత్తర్వులు విడుదల చేయాలని మంగళవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, కార్యదర్శి సువర్ణరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నాలుగు కరువుభత్యం కిస్తీలు పెండింగ్‌లో ఉంచి ఇచ్చిన ఒక డీఏ ఎరియర్ చెల్లింపు కూడా తీవ్రమైన జాప్యం ప్రదర్శించడం సహేతుకం కాదని తెలిపారు. డీఏ ద్వారా లభించే ఎరియర్‌లను ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత చెల్లిస్తాననడం ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడమే అని తెలిపారు. అంతేకాకుండా రిటైరైన ఉద్యోగులకు 2027-28 ఆర్థిక సంవత్సరంలో 12 వాయిదాలలో చెల్లిస్తామని జీవోలో పేర్కొనడం తగదని వెంటనే జీవోలు సవరించి ఎరియర్లు పీఎఫ్ ఖాతాలో జమయ్యే విధంగా, రిటైర్ అయిన ఉద్యోగులకు తక్షణమే నగదు చెల్లించే విధంగా జీవోలు సవరించి విడుదల చేయాలని రిటైర్ అయిన ఉద్యోగులకు ఎటువంటి ఆర్థిక బకాయిలు పెట్టరాదని దుర్గారావు, సువర్ణరాజు డిమాండ్ చేశారు.

గోదావరి ఏటిగట్టు రోడ్డు పటిష్టపరచాలి

● ఎంపీకి వినతిపత్రం అందజేసిన నాయకులు



ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

పెరవలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోదావరి ఏటిగట్టుపై విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు రోడ్డు వేయాలని మండలానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు ఎంపీ పురందేశ్వరికి మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రానున్న పుష్కరాలు సందర్భంగా గోదావరి ఏటిగట్టు వెంబడి వేలాది మంది యాత్రికులు ప్రయాణాలు చేస్తూ గోదావరి పొడవునా అనేక గ్రామాల్లో పుష్కర స్నానాలు ఆచరిస్తారని అందువల్ల ప్రస్తుతం అధ్వానంగా ఉన్న ఏటిగట్టును పటిష్టపరిచి తారు రోడ్డు వేయాల్సిన ఆవశ్యకత ఉందని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. గత పుష్కరాల కాలంలో మండల పరిధిలోని ఒక్క తీపర్రులోనే ప్రతీరోజూ లక్ష మంది యాత్రికులు పుణ్య స్నానాలు ఆచరించేవారని అదేవిధంగా కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, ఉసులుమర్రు, పెండ్యాల తదితర రేవుల్లో కూడా పెద్ద సంఖ్యలో పుష్కర స్నానాలు ఆచరించేందుకు జాతీయ రహదారి సిద్ధాంతం నుంచి విజ్జేశ్వరం వరకు రోడ్డు వేయాలని సంబంధిత శాఖలకు పంపి, ఈ పనులు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అదే విధంగా మంత్రి దుర్గేష్‌ను కూడా కలిసి ఇదే సమస్యపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెన్మత్స సుబ్రహ్మణ్యవర్మ, సింహాద్రి సత్యనారాయణ, రంగినీడి గంగాధరరావు, టీడీపీ నాయకులు మొగళ్ళపు సీతారామ్, నందమూరి నారాయణరావు, జనసేన నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ ఉన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

● కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ బాలాజీ సుందరరావు

నిడదవోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి వివిధ ప్రాంతాలలో పాత కేసులు సైతం ఛేదించామని సమిశ్రగూడెం ఎస్ఐ ఎల్.బాలాజీ సుందరరావు అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్లో ఆయన పలు వివరాలు వెల్లడించారు. రాజమండ్రికి చెందిన పల్లపాటి దుర్గాప్రసాద్ మరో ముగ్గురితో కలసి రాత్రి సమయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఇటీవల సమిశ్రగూడెంలో టీ షాపు యజమాని ఇంట్లో దొంగతనానికి పాల్పడి నగదు, బంగారు వస్తువులు దోచుకుపోయారని తెలిపారు. పోలీస్ ఉన్నతాధికార్లకు వచ్చిన సమాచారంపై ఈరోజు ఉదయం పల్లపాటి దుర్గప్రసాద్‌ను అరెస్ట్‌చేసి 50వేల నగదు, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నిందితుడిని అరెస్టు చేయడం ద్వారా సమిశ్రగూడెంలో మరో రెండు కేసులకు సంబంధించి రాజమండ్రి, తుని ప్రాంతాల్లో మరో ముగ్గురితో కలసి పలు నేరాలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని కోర్టుకు పంపుతున్నామని ఆయన తెలిపారు.

హాస్య నటుడు రాజబాబు జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్య నటుడు రాజబాబు 89వ జయంతి సోమవారం ఆయన తమ్ముడు బాబి ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ 1960లో సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన రాజబాబు 1982 వరకు 550 చిత్రాల్లో నటించి, ఎన్నో అవార్డులు అందుకుని, తెలుగువారి గుండెల్లో చిరంజీవిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, మునిని వెంకటేశ్వరరావు, కట్టా చంద్రరావు, బొమ్ముల సత్యబాలాజీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ తాతారావు

పెరవలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రతీఇంట కూరగాయలు పండించుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయప్రాజెక్టు మేనేజర్ తాతారావు పేర్కొన్నారు. తీపర్రులోని శ్రీమతి ఈద్పుగంటి రత్తమ్మ ధర్మసత్రంలో మంగళవారం సాయంత్రం రైతులకు, మహిళలకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కూరగాయలు పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడకుండా గోఆధారిత ఎరువులు పిచికారీ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చునని ప్రతీ గృహిణి ఇళ్ల వద్ద స్వయంగా కూరగాయలు పండించుకుంటే తద్వారా ఖర్చు ఆదా అవడంతోపాటు ఆరోగ్యకరమైన కూరగాయలు పండించుకోవచ్చునన్నారు. తీపర్రు సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ తన సొంతఖర్చుతో 11రకాల కూరగాయల విత్తనాలు ప్యాకెట్‌గా తయారుచేసి ప్రతీ ఇంటికీ అందించడం ఆనందదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డీపీఎంవో ఎస్‌కెఎం వల్లీ, మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్, ఏపీఎం రామకృష్ణ, బీజేపీ నాయకులు సత్యనారాయణ, జనసేన నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణపాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం కంటిపూడి సూర్యనారాయణ సమకూర్చిన విత్తనాలు ప్యాకెట్లను మహిళలకు ఉచితంగా అందజేశారు.